# ఆది సంఘము ఎందుకు అంత ధారాళంగా యిచ్చింది

మనము ఆది సంఘాన్ని చూచినప్పుడు, మనసును గట్టిగా హత్తుకునే వివిధ గుణగణాలను మనం కనుగొంటాం. వారికున్న ఆసక్తి త్వరితంగా ఎదగడం, ప్రభువుయెడల వారి నమ్మకం, అపొస్తలుల బోధను నిరంతరం అనుసరించడం, యింకా అనేక యితర సత్ లక్షణాలచే మనం ప్రభావితులమయ్యాం.

అధికంగా అభినందించదగిన గుణగణాలలో ఒకటి భౌతికమైన ఆస్తులపట్ల వారు చూపిన ఔదార్యం. వారు సణుగుకొంటూనో, బలవంతంగానో వారి కానుకలను సమర్పించ లేదు. వారికి పన్ను విధింపబడ లేదు, లేదా మనుష్యులకు కనబడవలెనని వారు యిచ్చినట్టులేదు. వారి యిచ్చుటలో ఏ స్వార్థపరమైన ఉద్దేశంలేనట్టు మనకు తెలుసు. ఎందుకంటే, వారి ఔదార్యము దైవ ప్రేరేపితులైన మనుష్యులచేత గంభీరమైన పదజాలంతో మెచ్చుకోబడింది. అవసరంలో ఉన్నవారితో పంచుకొనడానికి యెరూషలేములోని క్రైస్తవులు ఆస్తులను అమ్మి తెచ్చారు (అపొ. 4:34, 35). ఫిలిప్పీయుల యొక్కయు, యితర మాసిదోనియుల యొక్కయు ఔదార్యాన్ని పౌలు ఆకర్షించే పదజాలంతో పలికాడు (ఫిలిప్పీ. 4:14, 15; 2 కొరింథీ. 8:1-4). మొదటి శతాబ్దపు క్రైస్తవుల ఔదార్యాన్ని గూర్చి ఎట్టి సందేహమూ లేదు.

ఇతరులతో సువార్త పంచుకొనడంలో వారి అసాధారణమైన విజయానికి కారణం యిచ్చుటయే. లోకవ్యాప్తమైన సువార్త ప్రకటన, అవసరంలో ఉన్న పరిశుద్ధులను ఆదుకొనడం అనే పనులు వారి ఔదార్యాన్ని కోరాయి మరియు ఈ కార్యాలను జరపడానికి క్రైస్తవుల దాతృత్వము తోడ్పడింది.

ఇచ్చుటలో వారు అంత ధారాళంగా ఎందుకున్నారు? ఇవ్వడానికి జనులు తమ ఆస్తులను ఎందుకు అమ్మడానికి యిష్టపడ్డారు? ఈ శతాబ్దంలోని సంఘం తాను యిచ్చేదానికంటే ఎందుకు అధికంగా యివ్వలేకపోతుందో తీర్మానించుకోడానికి మొదటి శతాబ్దపు ఔదార్యాన్ని గూర్చి చదివితే సహాయపడుతుంది.

## తమను తామే యిచ్చుకున్నారు

వారు యివ్వడానికి గల ఒక సూత్రము 2 కొరింథీ. 8:5లో కన్పిస్తుంది: "మొదట ప్రభువునకును, ... తమ్మును తామే అప్పగించుకొనిరి." వారు యథార్థంగా మార్చబడ్డారు.

మార్పంటే తననర్పించుకోడం తనకున్న దానంతటిని ఇచ్చుకోడం అని తెలుసుకున్నారు. వీరు కేవలం పేరుకు మాత్రమే సంఘ సభ్యులుకారు. అది వ్యక్తిగతమైన నిర్ణయంతో కూడినది. "ఇక్కడ, ప్రభువా, నన్ను నేను నీకు అర్పించుకొంటున్నాను" అనేది వారి స్వభావం. ప్రభువు పక్షంగా ఒక వ్యక్తి యథార్థంగా మారినప్పుడు, భౌతికమైన ఆస్తులను సమర్పించడం కష్టమైన విషయం కాదు. నేడు అనేకమంది పిసినితనంగా, ధనాపేక్షులుగాను ఉండడానికి కారణం తమ్మును తాము సంపూర్ణంగా ప్రభువునకు సమర్పించుకొనక పోవడమే. మార్పు పొందడమంటే, సమయము, తలాంతులు, తనను తాను, ఆస్తులు దేవునికి సమర్పించుకొనడమేనని మనం నేర్చుకోవాలి.

## ఔదార్యముగల పూర్వ చరిత్ర వారికుంది

ఔదార్యానికి అనుకూలమైన సమాజంనుండి ఆది క్రైస్తవులు వచ్చారు. ఔదార్యపు చరిత్రగల యూదులతో యెరూషలేము సంఘం నింపబడింది. ప్రత్యక్ష గుడారపు నిర్మాణంలోను, దానిని ప్రతిష్టించే సమయంలోను ఇశ్రాయేలీయులు ఎలా అర్పణలు సమర్పించారో జ్ఞాపకం చేసికో. దేవాలయం కొరకు దావీదు అర్పణలు, దేవాలయం బాగుచేసే సమయంలో పోగైన కానుకలు, దేవాలయపు పునర్నిర్మాణంలో సమర్పించబడిన కానుకలను గూర్చి ఆలోచించు. ఈ పాత నిబంధన ఉదాహరణలు మనలో అనేకులను సిగ్గుపరచుతాయి.

దశమ భాగాలు, అర్పణలు, కానుకలు, బలులు అనేవి యూదా మతం క్రింద యూదులు జరిగించినవి బాగుగా ఎరుకైనవే. వారు అర్పించేవన్నిటిని లెక్కించితే వారి ఆదాయంలో చెప్పుకోదగిన శాతం ఉంటుంది. వారు క్రైస్తవ్యంలోనికి మార్పు చెందినప్పుడు, ధారాళంగా యివ్వడం సహజమే అయ్యింది. క్రీస్తు ఆధిపత్యం క్రింద ఎంత యివ్వవలసినది నిర్ణయించుకొనడానికి వారు స్వతంత్రులు అన్నమాట నిజమే; అయితే ఆ స్వాతంత్ర్యాన్ని వారు అత్యాశతో కప్పిపుచ్చుకోలేదు. వారు అలవాటుపడిన దానికంటె తక్కువ యిచ్చారా?

ఈ అంశంమీద ఎక్కువ ఉపదేశం అవసరం. సంఘంలో నొక్కి చెప్పబడిన అనేక అంశాలకంటె బైబిలు దీనిపై ఎక్కువగా చెప్పుతుంది. సత్యాన్ని స్పష్టంగా, బలీయంగా బోధించడంలో తప్పిపోవడమే క్రైస్తవ దాతృత్వానికి మంచి పూర్వ చరిత్ర లేకపోవడ మౌతుంది.

## గృహ నిర్వాహకత్వపు సూత్రాన్ని వారు గుర్తించారు

మొదటి శతాబ్దపు క్రైస్తవులు గృహ నిర్వాహకత్వపు సూత్రాన్ని గుర్తించారు. తమ సొత్తు తమ సొంతది కాదని వారు గ్రహించారు. మరియొకరి సొత్తుకు వారు గృహ నిర్వాహకులైయున్నట్టు వారు భావించారు. వారు దానిని ఎలా చేపట్టారో దానినిగూర్చి లెక్క చెప్పవలసినవారైనట్టు వారు వ్యవహరించారు; గనుక, వారు దానిని దేనికొరకు వాడారో దాని విషయంలో భద్రంగా ఉండాలని వారు కోరారు.

దైవికమైన యజమానత్వాన్ని గూర్చి అనేక లేఖన భాగాలు బోధిస్తాయి. ఉదాహరణకు,

"సమస్త భూమియు నాదేగదా" అని నిర్గమ. 19:5 అంటుంది. (తక్కినై – ద్వితీయో. 10:14; కీర్తన. 24:1; 1 కొరింథీ. 10:26). అలాగే మానవ గృహ నిర్వాహకత్వంకూడా బోధించబడింది. "దేవుని నానావిధమైన కృపవిషయమై మంచి గృహనిర్వాహుల"మై యుండాలని 1 పేతురు 4:10 బోధిస్తుంది. మన దేహాలు సహా మన సొంతమైనవికావని పౌలు నొక్కి చెప్పాడు (1 కొరింథీ. 6:19). మరియొకరికి చెందిన దానిని మనం జాగ్రత్త చేస్తున్నట్టు గ్రహించినప్పుడు, వాటిని మనం ఉపయోగించడంలో బహు జాగ్రత్త కలిగియుంటాం. దేనికి వాటిని ఉపయోగించామో దాని విషయంలో మనం బదులు చెప్పవలసినవారమైయున్నాం.

## దేవుని ప్రేమకు ప్రత్యుత్తరంగా వారు యిచ్చారు

మొదటి శతాబ్దంలోనివారు ధారాళంగా యిచ్చారు. ఎందుకంటే, వారు సిలువ నీడన జీవించారు. కల్వరిలో జరిగిన సంభవాలకు వారిలో కొందరు ప్రత్యక్ష సాక్షులై యున్నారు. దేవుని ప్రేమను ఆయన ఔదార్యమును అత్యున్నత స్థాయిలో వారు తిలకించారు. దేవుడు "ఎంతగానో ప్రేమించినట్టు" వారు గుర్తించారు, మరియు దానికి వారి ఎదుట రుజువున్నది; ఆయన "ఎలా యిచ్చాడో" వారు దాన్ని వీక్షించారు (యోహాను 3:16 చూడు). వారు దేవుని ప్రేమించారు "ఎందుకంటే ఆయన వారిని ముందుగా ప్రేమించాడు" (1 యోహాను 4:19), అందువలన యివ్వడంలో వారికి కష్టం లేదు.

## ముగింపు

కల్వరినుండి మనం అనేక శతాబ్దాల దూరమున్నాం, కాని అక్కడ ఏమి జరిగిందో దానిని కాలం తుడిచివేయలేదు. ఇచ్చుటలో నేడు ఔదార్యం లేక ధారాళత లేకపోవడానికి గొప్ప కారణం సిలువయొక్క అర్థాన్ని అభినందించడం లోపించడమే. దేవుడు మనలను "ఎంతగానో ప్రేమించి" మనకొరకు తన కుమారుని అనుగ్రహించాడు (యోహాను 3:16; ఎఫెసీ. 5:25 చూడు). దీన్ని జ్ఞాపకం చేసికొంటే, దేవునివైపు యిది మన హృదయాల్లో ప్రేమను పుట్టిస్తుంది. దేవుని ప్రేమ మనయెడల ఎట్టిదైయుందో అలాగే, ఈ ప్రేమ మనలో దాతృత్వంగా ప్రత్యక్షమౌతుంది.